క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో 2024 మే 13న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల ఎన్నికల నియమ నిబంధనల పర్యవేక్షణ (ఫ్లయింగ్ స్క్వాడ్) అధికారి కె.పాపయ్య అన్నారు. శుక్రవారం ఆయన రెంటచింతలలోని ఆనందపేట, నాయుడుపేట, అంబేడ్కర్ కాలనీ, ఆంజనేయస్వామి మాణ్యం కాలనీ, వెంకటేశ్వర స్వామి మాణ్యం కాలనీ, రైల్‌పేట కాలనీలలో పర్యటించి ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ మే 13న ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఈ బృందం మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయడంలో భాగంగా ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నూతనంగా ఏర్పాటు చేసిన సి-విజిల్ యాప్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు అయితే వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం క్షేత్రస్థాయిలో స్పందిస్తుందన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాలలో నగదు, మద్యం, ఇతర వస్తువులు తరలించడం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

గొట్టిపాళ్లలో పోలీసు కవాతు



వెల్దుర్తి: మండలంలోని గొట్టిపాళ్ళ గ్రామంలో శుక్రవారం మాచర్ల రూరల్ సీఐ సురేష్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్, పోలీసు సిబ్బందితో పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ మాట్లాడుతూ మండలంలోని సమస్యాత్మక గ్రామాలలో పోలీసు కవాతు నిర్వహించటం జరుగుతుందన్నారు. అందులో భాగంగా గొట్టిపాళ్ళ గ్రామంలో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. రాబోయే ఎన్నికల్లో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ఉద్రిక్తతలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా ఈ కవాతు నిర్వహిస్తున్నామన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. వెల్దుర్తి ఎస్ఐ శ్రీహరి, మాచర్ల రూరల్ ఎస్ఐ రాజశేఖర్, నాగార్జున సాగర్ ఎస్ఐ కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాప్ అవుట్స్‌పై అవేర్నెస్ వాక్



పిడుగురాళ్ల: బాలికలను చదువే ఉన్నత శిఖరాలకు తీసుకెళుతుందని కార్ప్ సంస్థ స్కూల్ ఇన్‌చార్జి ఆర్.అనిత అన్నారు. పట్టణంలోని లెనిన్‌నగర్‌లోని కార్ప్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం డ్రాప్ అవుట్ రేట్ తగ్గించేందుకు అవేర్నెస్ వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ కార్ప్ సంస్థ డైరెక్టర్ మేరీ ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కార్ప్ స్వచ్ఛంద సేవా సంస్థ బ్రాక్ స్కూల్ నిర్వహిస్తుందన్నారు. బాలికలకు ఉన్నత చదువు అందించాలన్న సంకల్పంలో బ్రాక్ స్కూల్ నిర్వహిస్తున్నామన్నారు. 1995 నుంచి కార్ప్ సంస్థ ఈ బ్రాక్ స్కూల్ నిర్వహిస్తుందన్నారు. పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తామని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. అనంతరం ర్యాలీ, మానవహారం నిర్వహించారు. బ్రాక్ స్కూల్ హెచ్ఎం లత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కనుల పండువగా శాంతి కల్యాణం



రెంటచింతల: స్థానిక సుబ్బన్నతోట కాలనీలోని అలివేలు మంగా పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం 20వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవం కనులపండువగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ ఓరుగంటి మారుతీశర్మ ఆధ్వర్యంలో యాజ్ఞిక స్వాములు జిగురు చంద్రశేఖర్ శర్మ, లక్ష్మీ శివప్రసాద్ శర్మ, శంకర్ శర్మ నేతృత్వంలో స్వామి వారికి ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, 6.30 గంటలకు పుష్పాభిషేకం, సహస్రనామార్చన, 8 గంటలకు సుదర్శనహోమం, స్వామి అమ్మవార్లకు ఎదురుకోల మహోత్సవం, 11 గంటలకు శాంతి కల్యాణం వైభవంగా జరిపించారు. భక్తులకు మహాఅన్నదానం చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించి బ్రహ్మయ్యబావి సెంటర్ వద్ద లడ్డు (1 గ్రాము బంగారు లాకెట్)కు వేలం పాట నిర్వహించారు. దేవాలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలు, మామిడి తోరణాలతో అలంకరించారు. దేవస్థానం చైర్మన్ నాళం పెదబాబు, పాలక వర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాపులను రక్షించుటకై ఏసు సిలువ మరణం

- ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు
- చర్చిలలో, ప్రార్థనా మందిరాలలో ప్రత్యేక ప్రార్థనలు

రెంటచింతల: యెహోవా దేవుని కుమారుడైన ఏసుక్రీస్తు భూలోకంలోని పాపులను రక్షించుటకై సిలువ మరణం పొందారని కానుకమాత చర్చి సహాయక గురువులు రె.ఫాదర్ అగస్టీన్ అన్నారు. స్థానిక కానుకమాత చర్చి ఆవరణలో విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దు మర్రెడ్డి నేతృత్వంలో ఫాదర్లు ఏరువ బాల శౌర్రెడ్డి, పాపయ్య కలిసి గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన భక్తులనుద్దేశించి మాట్లాడారు. లోకరక్షకుడైన ఏసుక్రీస్తు చివరి గడియలలో పడిన శ్రమలను (14స్థలాలను) కళ్లకు కట్టినట్లుగా భక్తులకు ప్రత్యక్షంగా ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ముందుగా ఫాదర్లు విచారణ గురువులు వైఎల్ మర్రెడ్డి పవిత్ర సాంగ్యాలతో ప్రార్థనలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాలకు చెందిన ప్రభువైన ఏసుక్రీస్తును ఆరాధించే వేలాదిమంది కథోలికులు ఏసుక్రీస్తు సిలువ దారణను తిలకించారు. తపస్సుకాల దీక్షలను భక్తులు శనివారం ఉదయం 7 గంటలకు విరమింపచేయడం జరుగుతుందని ఫాదర్ లూర్దు మర్రెడ్డి తెలిపారు. స్థానిక ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో పాస్టర్ కటికల ఏసుదానం, తుమృకోట ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో తూర్పు మాజీ బిషప్ పాస్టర్ రె.డేగల యోహాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి శుభ శుక్రవారం విశిష్టతను వివరించారు. మండలంలోని పలు గ్రామాలలోని చర్చిలలో, ప్రార్థనా మందిరాలలో గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రీస్తు విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సహాయ గురువులు అగస్టీన్, బ్రదర్ నిఖిల్ తేజ, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రపంచ మానవాళికి క్రీస్తు ఆదర్శం

వెల్దుర్తి: మండలంలోని మండాది గ్రామంలో ఏఈఎల్‌సీ చర్చిలో గుడ్ ఫ్రైడే సందర్భంగా క్రీస్తు సందేశాన్ని రెవ.ఎ.జాన్ మోజెస్ క్రైస్తవులకు అందించారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటి మనుషుల పట్ల ప్రేమ, నిస్సాహాయుల పట్ల కరుణ, శత్రువుల పట్ల క్షమ, ఆకాశమంతటి సహనం, అవధుల్లేని త్యాగం, ఇది మానవాళికి జీసస్ ఇచ్చిన సందేశమన్నారు. క్రీస్తు సందేశం మానవాళికి ఆదర్శమన్నారు. క్రైస్తవులు తాము సంపాదించిన దానిలో కొంత భాగాన్ని పేద ప్రజలకు సాయం చేయాలన్నారు. క్రైస్తవ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కానుకమాత చర్చి ఆవరణలో సిలువదారి ప్రదర్శన నిర్వహిస్తున్న భక్తులు



దాచేపల్లిలో సిలువ యాగం నిర్వహిస్తున్న దృశ్యం



కేసానుపల్లిలో.. పాస్టర్ ప్రసన్నకుమార్



మండాదిలో.. రెవ.జాన్ మోజెస్



మండాదిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



మాచర్ల ఫిలోషిప్ ప్రార్థనా మందిరంలో..



పిన్నెల్లి తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న మహిళలు



మాచర్ల బేతేలు మందిరంలో..

క్రీస్తుని విశ్వసించాలి

దాచేపల్లి : మారుమనస్సు కలిగి క్రీస్తుని విశ్వసించాలని పాస్టర్ గనుపల్లి శ్యాం ప్రసన్నకుమార్ అన్నారు. మండల వ్యాప్తంగా గుడ్ ఫ్రైడే సందర్భంగా చర్చిల్లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. నగర పంచాయతీలోని దక్షిణ గడ్డ లూథరన్ చర్చి ఆధ్వర్యంలో సిలువ యాగం కార్యక్రమం నిర్వహించారు. ఏసుక్రీస్తు సిలువలో పలికిన ఏడు మాటలపై ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కేసానుపల్లి లూథరన్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాస్టర్ ప్రసన్న కుమార్ ప్రసంగిస్తూ..ప్రతి ఒక్కరి పాపాల కోసం క్రీస్తు సిలువ మరణం పొందారని, సిలువలో క్రీస్తు చిందించిన రక్తం ద్వారా మానవులకు రక్షణ లభించిందన్నారు. క్రీస్తు చెప్పిన బోధనలు పాటిస్తూ ఆయన రాకడకోసం కనిపెట్టుకుని జీవించాలని, జాలి, దయ, ప్రేమ కలిగి ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఫాదర్ యామర్తి సురేష్, కేఎస్ డేవిడ్‌రాజు, మాచర్ల మోజేస్, పి.జయపాల్ పాల్గొన్నారు.

పిడుగురాళ్లలో గుడ్ ఫ్రైడే వేడుకలు యాడింగ్.......

పిడుగురాళ్ల: పట్టణంలోని పలు చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే పండుగను క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చర్చి ఫాదర్లు మాట్లాడుతూ మానవాళిని పాపముల నుంచి రక్షించడం కోసం ప్రభువైన ఏసు క్రీస్తు తన ప్రాణాలను అర్పించిన రోజు, పాపముల నుంచి విముక్తి కలిగించడం కోసం తనని తాను సంతోషంగా త్యాగం చేసుకున్న రోజు, అందుకే ఆ రోజును క్రైస్తువులందరు ప్రపంచవ్యాప్తంగా గుడ్ ఫ్రైడేగా భావిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆయా చర్చిల్లో ప్రత్యే ప్రార్థనలు నిర్వహించారు. ప్రజల కోసం క్రీస్తు పడిన కష్టాలు ఫాదర్లు భక్తులకు వివరించారు. భక్తులు బైబిల్ పఠనం చేశారు.

సర్వమానవాళి రక్షణకే క్రీస్తు సిలువ యాగం

మాచవరం: సర్వమానవాళిని పాపముల నుంచి రక్షించుటకే ఏసుక్రీస్తు సిలువపై ప్రాణత్యాగం చేయడం జరిగిందని పాస్టర్లు వి.గురుప్రసాద్, ఎం.జీవితప్రకాష్, డేవిడ్‌లు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిలలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవ సోదరులు ఉపవాస ప్రార్థనలు చేపట్టారు. స్తుతి గీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు దైవ సందేశాన్ని తెలియజేశారు. సిలువపై ఏసుక్రీస్తు పలికిన ఏడు మాటల ప్రాముఖ్యతను వివరించారు. మాచవరం ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన సిలువ యాగ ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. పాస్టర్లు , క్రైస్తవులు పాల్గొన్నారు.

మాచర్ల పట్టణంలో శుభ శుక్రవారం

మాచర్ల: పట్టణంలోని చర్చిల్లో శుభ శుక్రవారం నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని 70 చర్చిల్లో ఆయా చర్చి పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేసిన క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేను ప్రత్యేకంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఏసుక్రీస్తు లోకజనుల కోసం ఏ విధంగా తనను తాను సమర్పించుకొని సిలువను మోశాడనే విషయంపై ఆయన త్యాగాలపై కీర్తనలు పాడుతూ ప్రార్థనలు చేశారు. పట్టణంలోని లూథరన్ చర్చిలో పశ్చిమ సినడ్ బిషప్ చాట్ల ఐజయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెలుగు బాప్టిస్టు చర్చి సంఘ కాపరి రెవ.రవికుమార్, సంఘ పెద్దలు మాచర్ల నాగేశ్వరరావు, పెద్ద ఏసోబు, కందుల యోహాను, మాచర్ల దేవానంద్, చిన్న కోటి, విజయ్‌భాస్కర్, వాసు ఆధ్వర్యంలో క్రీస్తును స్తుతించారు. ది లెమెన్ ఇవాంజలికల్ చర్చి, ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ కొమ్మారెడ్డి రఫేల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బేతేలు మందిరంలో జాన్ వెస్లీ ఆధ్వర్యంలో పునీతులైన క్రీస్తు గురించి వివరించారు. జేబీపీఎఫ్ చర్చి పాస్టర్ బ్రహ్మనాయుడు, మరనాత చర్చి, పెంతెకోస్తు, 24వ వార్డులో పాస్టర్ ఎలీషా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సెరిన్ కాలనీలో పాస్టర్ వేల్పుల దానియేలు, వినాయకుని గుట్టలో పాస్టర్ వేల్పుల గురవయ్య, 9వ వార్డులోని చర్చిలో పాస్టర్ ప్రవీణ్‌కుమార్, వార్డు కౌన్సిలర్ మందా సంతోష్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిపారు. క్రీస్తును కీర్తిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.



మాచర్ల లూథరన్ చర్చిలో బిషప్ చాట్ల ఐజయ్య



మాచవరంలో సిలువ యాగం నిర్వహిస్తున్న దృశ్యం

కంటతడి పెట్టించిన ఏసుక్రీస్తు సిలువ యాత్ర ప్రదర్శన

విజయపురిసౌత్: గుడ్ ఫ్రైడే పురస్కరించుకొని సాగర్ మాత దేవాలయంలో శుక్రవారం ప్రదర్శించిన ఏసుక్రీస్తు సిలువయాత్ర ప్రదర్శన పలువురిని కంటతడి పెట్టించింది. లోకంలో అందరి పాపాలను తొలగించేందుకు కల్వరి గిరిలో సిలువను భుజం మీద మోసుకొని ఏసుప్రభువు పడిన కష్టాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ దృశ్యాలను తిలకించిన భక్తుల మనస్సులు చలించాయి. ఏసు సిలువ యాత్రలో 14 స్థానాల్లో హేరోదు రాజు పిలాతు ఇచ్చిన మరణతీర్పు, రాజభటులు ఏసుపై సిలువను మోయించడం, కన్నతల్లి మేరిమాత ఎదురుపడటం, వేరోనికమ్మ ఏసు ముఖాన్ని తుడవటం, జెరూసలేం స్త్రీలు ఎదురపడి విలపించటం, ఏసును సిలువకు బంధించి కొరడాలతో కొట్టడం, సిలువ వేసిన ఏసును దించటం, సమాధిలో ఉంచే సన్నివేశాలు కంటతడి పెట్టించాయి. ప్రశ్చాత్తాప పడటం, పాప క్షమాపణ పొందటం ఏసు సిలువ యాత్రలో చోటు చేసుకున్నాయి. ఏసుక్రీస్తు పాత్రను దుగ్గెంపూడి సుభాష్‌రెడ్డి రక్తి కట్టించారు. అనంతరం దేవాలయంలో ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ దివ్యబలిపూజా కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. దీనికి ముందు ఉదయం సాగర్‌మాత ఆలయంలో వేలాది మంది భక్తులు ఉపవాస దీక్షలలో పాల్గొన్నారు. 40 రోజుల పాటు మాలలు ధరించిన సాగర్ మాత భక్తులు ప్రార్థనలు నిర్వహించి మాలలు విరమించారు. ఈ కార్యక్రమంలో గుడి పెద్దలు డి.ఇన్నారెడ్డి, జెక్కిరెడ్డి చిన్నపరెడ్డి, శౌర్రాజు, కట్టారాజు, శౌరిబాబు, ఎం.మరియదాసు, చందు పాల్గొన్నారు.



సాగర్‌మాత దేవాలయంలో ఏసు సిలువ యాత్ర ప్రదర్శన

జీసస్ త్యాగాన్ని స్మరించుకోవడమే గుడ్ ఫ్రైడే



లూథరన్ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ పీఆర్కే



తెలుగు బాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ పీఆర్కే

ప్రభుత్వ విప్ పీఆర్కే

రెంటచింతల: ప్రపంచ మానవాళిని పాపముల నుంచి రక్షించుటకై సిలువ మరణం పొందిన యెహోవా దేవుని కుమారుడైన జీసస్ మహాత్యాగాన్ని స్మరించుకోవడమే గుడ్ ఫ్రైడే అని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం స్థానిక ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో నిర్వహించిన వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలను సన్మార్గంలో నడిపించడానికి యేసుక్రీస్తు ప్రాణత్యాగం చేశారని ఆయన చూపిన ప్రేమ, దయ, కరుణ మనం తోటి వారి పట్ల చూపాలన్నారు. మన జగనన్న పాలనలో నియోజకవర్గంలోని రెంటచింతల, జెట్టిపాలెం, పశర్లపాడు, తుమృకోట, పాలువాయి, కండ్లకుంట, చింతపల్లి, రెడ్డిపాలెం, శిరిగిరిపాడు, పేటసన్నెగండ్ల, ముటుకూరు తదితర మారుమూల గ్రామాలలోని చర్చిల పునర్నిర్మాణానికి, అభివృద్ధికి సుమారు రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. రెంటచింతల గ్రామంలోని అతిపురాతనమైన 120 సంవత్సరాల చరిత్ర గల ఈ లూథరన్ చర్చి పునర్నిర్మాణం విషయం తన దృష్టికి సంఘ పెద్దలు తీసుకువచ్చిన వెంటనే సొంత నిధులు రూ.25 లక్షల వరకు కేటాయించినట్లు తెలిపారు. కాలనీలో మిగిలిన రహదారుల అభివృద్ధికి కూడా కృషి చేస్తానన్నారు. 45 రోజులలో చర్చి నిర్మాణంతో పాటు జనరేటర్‌ను కూడా ఈ చర్చికి కానుకగా అందజేస్తానని హామీనిచ్చారు. 14 సంవత్సరాలు సీఎంగా ఉన్న చంద్రబాబు హయాంలో రాష్ట్రంలో ఏ ఒక్క చర్చి అభివృద్ధికి ఒక లక్ష రూపాయలను కూడా కేటాయించలేదని గుర్తుంచుకోవాలన్నారు. పార్టీలను చూడకుండా అనేక సంక్షేమ పథకాలను పేదలకు అందజేసి మేలు చేసిన జగనన్నకు మనమందరం అండగా ఉందామన్నారు. ప్రభువును మీరు నమ్మారు... నేను నమ్మాను... జగనన్న కూడా నమ్ముతున్నారన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రభువును నమ్మిన వారికి తప్పకుండా మంచి జరుగుతుందన్నారు. సర్పంచ్ పేర్ల చౌడమ్మ, పాస్టర్ కటికల ఏసుదానం, మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, వైస్ ఎంపీపీ ఏరువ శౌర్రెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, మాజీ ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మాజీ మండల అధ్యక్షులు పూజల రామయ్య, మండల యూత్ అధ్యక్షులు కె.సతీష్‌రెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ పమ్మి సీతారామిరెడ్డి, సంఘం పెద్దలు డేగల సంసోన్, సామేలు, పార్టీ నాయకులు, తుమ్మా ఇన్నారెడ్డి, బి.బ్రహ్మారెడ్డి, పులి ఓబుల్ రెడ్డి, వై.ప్రతాప్‌రెడ్డి, డి.నారపరెడ్డి, కె.మర్రెడ్డి, బి.తిరుపతిరావు తదితరులున్నారు.

తెలుగుబాప్టిస్టు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

మాచర్ల: శుభ శుక్రవారం సందర్భంగా తెలుగు బాప్టిస్టు చర్చిలో శుక్రవారం జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొని ప్రార్థనలు చేశారు. ప్రతి ఒక్కరికీ ప్రభువు ఆశీస్సులుండాలని ఆకాంక్షించారు. పలువురు చర్చి పాస్టర్లు, పెద్దలు ఆయనను ఆశీర్వదించారు. మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, కౌన్సిలర్ మాచర్ల సుందరరావు, పాస్టర్ రవికుమార్, సంఘ పెద్దలు నాగేశ్వరరావు, పవన్, దేవానంద్, విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

గొప్ప త్యాగధనుడు ఏసుక్రీస్తు


దుర్గి: ఏసు ప్రభువు త్యాగానికి గుర్తుగా ప్రపంచంలోని సర్వ మానవాళి జరుపుకునే పండుగ గుడ్‌ఫ్రైడే అని పల్నాడు జిల్లా అభివృద్ధి మండలి చైర్మన్, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అడిగొప్పల ఇమ్మానియేలు చర్చిలో సంఘ పెద్దలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సర్పంచ్ నలబోతు వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ రామయ్య, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, ఎంపీటీసీ హుస్సేన్, నాయకులు యలమంద,లక్ష్మీనారాయణ, మధు, వెంకయ్య, నాగేశ్వరరావు, శివకృష్ణ, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవాలు

రాజుపాలెం: మండలంలోని ఆకుల గణపవరంలో వేంచేసి ఉన్న ప్రసన్నాంజనేయస్వామి 95వ జయంతి మహోత్సవాలు నేటి (శనివారం) నుంచి సోమవారం వరకు మూడు రోజులు జరుగనున్నాయని దేవదాయ శాఖ ఈవో ఔదారి వెంకటేశ్వరరెడ్డి శుక్రవారం తెలిపారు. శనివారం లక్ష తమలపాకులతో పూజా కార్యక్రమాలు జరుగును. సాయంత్రం వేళల్లో డప్పు వాయిద్యాలతో స్వామి వారి గ్రామోత్సవం జరుగును. 31వ తేదీన జిల్లా స్థాయిలో భజన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వబడును. 1వ తేదీన వసంతోత్సం జరుగును. ప్రతి రోజు సాయంత్రం వేళల్లో భజన కార్యక్రమాలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడునని తెలిపారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే కాసు



మాడుగులలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాసు పక్కన ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్

గురజాల: అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ఎంపీ అభ్యర్థి పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని అంజనాపురం, మాడుగుల, సమాధానంపేట, గొట్టిముక్కల, దైద, తేలుకుట్ల గ్రామాల్లో శుక్రవారం వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్నాడు అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పాలన అందించారన్నారు. సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, కులమతాలకతీతంగా సంక్షేమ పథకాలు అందించడం జరిగిందన్నారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే తప్పనిసరిగా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, జెడ్పీటీసీ ఆరికట్ల శ్రీనివాసరెడ్డి, కొమ్మినేని బుజ్జి, వేముల చలమయ్య, కో ఆప్షన్ సభ్యుడు షేక్ పీర్ అహ్మద్, మాచర్ల ఇవాంజెలికల్ బాబు, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘన స్వాగతం పలికిన ప్రజలు..

మొదటి సారి గురజాలకు విచ్చేసిన ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌కు మండల ప్రజలు ఘన స్వాగతం పలికారు. అడుగడుగునా ప్రజలు హారతులతో స్వాగతం పలికారు. ముందుగా గురజాలలోని గంగమ్మ తల్లి దేవాలయం, మాడుగుల, దైద, గొట్టిముక్కల, సమాధానం పేట, తేలుకుట్ల గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఓర్పు, త్యాగానికి ప్రతీక క్రీస్తు సిలువ మరణం



మాడుగుల చర్చిలో ఎమ్మెల్యే కాసు, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్

గురజాల: ఓర్పు, త్యాగానికి సహనం, ప్రేమ కరుణకు మార్గం క్రీస్తు సిలువ మరణమని పలువురు పాస్టర్లు సూచించారు. నియోజకవర్గ కేంద్రం గురజాలలో గుడ్ ఫ్రైడే వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు మాట్లాడుతూ దైవ దూత ఏసు ప్రభువు మార్గం మానవత్వమేగాని మతం కాదన్నారు. ప్రతి ఒక్కరూ మారు మనస్సు పొంది రక్షణ పొందాలని పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పలు చర్చిల్లో ప్రత్యేక పార్థనలు చేశారు. గుడ్ న్యూస్ ఇంగ్లీషు మీడియం పాఠశాల చర్చి సభ్యులు క్రీస్తు సిలువ మరణంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో విశ్వాసులు, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మాడుగుల చర్చిలో..

మండల పరిధిలోని మాడుగుల చర్చిలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి పి.అనిల్ కుమార్ యాదవ్‌లు గుడ్ ఫ్రైడే పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవుని దీవెనలు ప్రతి ఒక్కరిపై ఉండాలని అందరూ ఆనందంగా సుఖసంతోషాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, బండ్ల వెంకయ్య, మాచర్ల ఇవాంజెలికల్ బాబు, సాగర్ బాబు, తదితరులున్నారు.

ఏపీఆర్ డిగ్రీ కళాశాల ప్రవేశానికి దరఖాస్తు గడువు పెంపు



విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ డిగ్రీ కళాశాల (బాలురు)లో మొదటి సంవత్సరంలో చేరేందుకు ఏపీఆర్‌డీసీ సెట్-2024 ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విద్యార్థులకు గడువు పెంచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వైఎస్ఎస్ చౌదరి తెలిపారు. శుక్రవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు ఈ నెల 31 చివరి తేదీ కాగా దీనిని ఏప్రిల్ 5వ తేదీ వరకు గడువు పెంచినట్లు తెలిపారు. అలాగే ఏపీఆర్‌జేసీ, ఏపీఆర్ స్కూల్స్‌కు దరఖాస్తుకు ఏప్రిల్ 5వ తేదీ వరకు పెంచినట్లు తెలిపారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25వ తేదీ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ పరీక్ష 26 జిల్లా కేంద్రాలలో జరుగుతుందన్నారు.